అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శుక్రవారం 21 జులై 2023

## 'గత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ ఇవ్వలేదు'

నవతెలంగాణ-జైపూర్

24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదని బీఆర్ఎస్ మండల నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో గల రైతు వేదిక వద్ద రైతులతో సమావేశమైన నాయకులు మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ 24 గంటలు పంపిణీ చేస్తుందని అన్నారు. ఇంత గొప్ప పథకం అమలు చేస్తున్న తీరును జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు ఉచిత విద్యుత్ పథకానికి ఉరి వేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుండు తిరుపతితో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బలమూరి అరవిందరావు, పాలమాకుల సురేందర్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ లింగస్వామిలతో పాటు సమావేశంలో నాయకులు మేడి తిరుపతి, గోదారి లక్ష్మన్ పాల్గొన్నారు. '

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయపల్లి బోర్డువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అలకొండ పోశం(50) అక్కడికక్కడే మృతి చెందాడు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పోశం కాసిపేట రోడ్డు నుండి నేషనల్ హైవే దాటుతుండగా తాండూర్ ఐబి నుంచి బెల్లంపల్లికి వెళ్తున్న కారు నెంబర్ టీఎస్ 07 హెచ్ వై 6428 ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అతివేగంగా ఢీకొనగా వ్యక్తి ఎగిరి కారు పై పడి సంఘటన పలువురిని భయాందోళనకు గురిచేసింది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలానికి తాండూర్ ఎస్సై రాజశేఖర్ చేరుకొని మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుమారుడు రవితేజ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# దివికేగిన రాజకీయ దిగ్గజం


- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత సీఆర్ఆర్ అస్తమయం
- అనారోగ్యంతో హైదరాబాదులో కన్నుమూత
- నాలుగు సార్లు ఎమ్మెల్యే..రెండు సార్లు మంత్రిగా సేవలు
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాజకీయ కురువృద్ధుడు, ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిల్కూరి రాంచంద్రారెడ్డి(78) పరమపదించారు. అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చేరిన ఆయన గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో నాలుగు సార్లు శాసనసభ్యుడిగా.. రెండు సార్లు మంత్రిగా సేవలందించిన ఆయన ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్రవేశారు. తన జీవిత చరమాంకం వరకు ప్రజల్లోనే ఉన్న ఆయన ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలందించారు. ఉమ్మడి జిల్లాలో రాజకీయ దురంధరుడిగా పేరుగాంచిన ఆయన పార్టీలకు అతీతంగా అభిమానులను కలిగి ఉన్నారు. రాంచంద్రారెడ్డి ఇక లేరనే విషయాన్ని పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

**జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర**

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చిల్కూరి రాంచంద్రారెడ్డి తనదైన ముద్రవేశారు. 1944లో జన్మించిన ఆయన 1978లో తొలిసారి స్వతంత్రంగా బరిలోకి దిగి ఆదిలాబాద్ శాసనసభ్యుడిగా గెలుపొందిన ఆయన తిరిగి 1985లోనూ స్వతంత్రంగానే గెలుపొందారు. అనంతరం 1989లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి 1991-1992 వరకు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో చిన్ననీటి పారుదలశాఖ మంత్రిగా, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాంలో మార్కెటింగ్‌శాఖ మంత్రిగా సేవలందించారు. అనంతరం 2004లోనూ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈయన హయాంలోనే ప్రస్తుతం జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆస్పత్రితో పాటు తాంసి మండలంలో మత్తడివాగు ప్రాజెక్టులు నిర్మితమయ్యాయి.వీటితో పాటు సీసీఐ పరిశ్రమతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారు.



**జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర**

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఈయన ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న అనేక మంది నాయకులు ఈయన శిష్యరికంలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారనే ప్రచారం ఉంది. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా అనేక ఏండ్ల పాటు సేవలందించిన ఈయన ఆ పార్టీ అగ్రనాయకులతో పరిచయాలు ఉన్నాయి. ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు జిల్లా పర్యటనలకు వచ్చిన సందర్భంలో ఈయన ఇంటికే వెళ్తుండేవారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ఇటీవల వరకు వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం రాంచంద్రారెడ్డికే అధిక ప్రాధాన్యమిచ్చారు. జిల్లాలో సీఆర్ఆర్ ఆలోచనలకు అనుగుణంగా పార్టీని ముందుకు తీసుకెళ్తామని ప్రస్తావించడం గమనార్హం. సీఆర్ఆర్ పార్థివదేహాన్ని శుక్రవారం ఉదయం 6గంటల నుంచి జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. ఉదయం 11గంటలకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు.





నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో సీఆర్ఆర్..



నాటి ప్రధాని రాజీవ్ గాంధీతో సీఆర్ఆర్..

## వరిలో వెదజల్లే పద్ధతి అవలంబించాలి

నవతెలంగాణ-కోటపల్లి

వరిసాగులో రైతులు వెదజల్లే పద్ధతిని అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి కవిత అన్నారు. చెన్నూరు మండలంలోని ఆస్నాద్ గ్రామంలో గురువారం ఆమె రైతులతో వాన కాలంలో పంటలకు సంక్రమించే చీడపీడలు, కలుపు నియంత్రణపై అవగాహన, క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి నారు మడులను పెంచుకునేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నారు పెరిగేటప్పుడు రసాయన ఎరువులు వాడొద్దని జీవసంబంధం ఎరువులను వాడి పెంచుకోవాలన్నారు. రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతిని కొద్ది రోజుల తర్వాత భూమి బీడువారిపోతుందని అన్నారు. అలాగే వరి పొలంలో వెదజల్లే పద్ధతిని అవలంబించడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని అన్నారు. వెదజల్లే పద్ధతి వల్ల రైతులకు దిగుబడి కూడా అధికంగా వస్తుందని అన్నారు. ప్రతి రైతు రైతు బీమా చేసుకోవాలని, అలాగే ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రాజశేఖర్, శివరంజని, మండల రైతుబంధు సమితి సభ్యులు ఎనగంటి వెంకటేశ్వరరావు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి సీఓఈ విద్యార్థులకు జేఎన్టీయూలో సీటు

నవతెలంగాణ-తాండూర్

అత్యంత నాణ్యమైన టెక్నికల్ కోర్సులను ఆఫర్ చేస్తున్న (జెఎన్టీయూ)లో, బెల్లంపల్లి సీఓఈకి చెందిన నలుగురు విద్యార్థులుసీట్లు సాధించినట్లు ప్రిన్సిపల్ ఐనాల సైదులు తెలిపారు. సీట్లు సాధించినవారిలో అలకటి గణేష్(మెకానికల్ ఇంజనీరింగ్), భూక్య అరవింద్(బయోటెక్నాలజీ), ఎనగందుల మౌర్య(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్), తాళ్ల పవన్ కళ్యాణ్( సివిల్ ఇంజనీరింగ్)ఉన్నారని తెలిపారు. బెల్లంపల్లి సీఓఈ నుంచి జేఎన్టీయూలో 14 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ చదువున్నట్టు తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను, వైస్ ప్రిన్సిపల్ కె.రాజకుమార్, అధ్యాపకులు చందా లక్ష్మీనారాయణ, అవునూరి రవి, నాగిని శ్రీరామవర్మ, మిట్ట రమేష్, సుంకరి రమేష్, ఆకినేపల్లి రాజేష్, తాటిపాముల నరేష్ అభినందించారు.

## అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మహారాష్ట్ర నుండి తెలంగాణ రాష్ట్రానికి ప్రభుత్వ నిషేధిత వస్తువులు, మద్యం అక్రమంగా తరలించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నుండి ముత్తంపేట గ్రామానికి దేశీదారును తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెంకట్రావ్‌పేట్ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ముత్తంపేట గ్రామానికి చెందిన దుర్గం ముకుంద్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై 99 దేశీదారు సీసాలను తరలిస్తుండగా పట్టుబడ్డారు. అతనిపై కేసు నమోదుచేసినట్టు ఆమె తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్సై కిశన్, సిబ్బంది లింగన్న, శ్రీనివాస్, వెంకటేశ్ ఉన్నారు.

## గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జైపూర్

ఏకదాటిగా వర్షాలు కురుస్తున్నందున గోదావరి తీర దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసీల్దార్ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండగా మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. పూరాతన ఇంటి గోడలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదే విధంగా విద్యుత్ స్థంబాలకు దూరంగా ఉండాలని సమీప గోదావరి నది వైపు మనుషులు, పశువులు, మత్సకారులు వెళ్లకుండా ఉండాలని తెలిపారు.

## ఖాళీ అయిన ప్రభుత్వ భవనాలు హాస్టళ్లకు కేటాయించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభం తర్వాత జిల్లా కేంద్రంలోని అన్ని కార్యాలయాలు సమీకృత భవనంలోకి రావడంతో ఖాళీ అయిన ప్రభుత్వ భవనాలు హాస్టల్‌లకు కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కాడేకి వివిధ సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత భవనం పూర్తి కావడంతో అనేక ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. వాటిని అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్టీ, ఎస్సీ, బీసీ ఎస్ఎంఎస్ బాలికల, బీసీ ఎస్ఎంఎస్ బాలుర, ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థలో ఉందన్నారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుకుంటూ హాస్టల్లో ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వ భవనాలలోకి హాస్టలను మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలకు మొగ్గు చూపాలి

నవతెలంగాణ-కోటపల్లి

ఉద్యానవన తోటల పెంపకానికి అర్హులైన రైతులను గుర్తించాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. కోటపల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉద్యానవనాల తోటల పెంపకానికి పెట్టుబడి సాయంపై పంచాయతీ కార్యదర్శులకు ఈజీఎస్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉద్యానవ తోటల పెంపకానికి పెట్టుబడి సాయం అందించేందుకు సిద్ధంగా ఉందని ఆయా శాఖల సిబ్బంది గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేందర్, ఎంపీపీ మంత్రి సురేఖ పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలి

**ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ సమీపంలో గల శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని పట్టణ విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) ఐక్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సమావేశం నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా మారిందని కమ్యూనిటీ హాల్ నిర్మిస్తే సమస్య తీరుతుందన్నారు. అలాగే ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కమ్యూనిటీ హాల్‌కు సెడ్, ప్రహరీ గోడ నిర్మాణంకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం అధ్యక్ష కార్యదర్శి భాస్కరాచారి, అశోక్, జిల్లా గౌరవ అధ్యక్షులు సురేష్, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి నల్గొండ శ్రీరాములు, వరప్రసాద్, జిల్లా నాయకులు శ్రీరామోజు వెంకటయ్య, మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, గద్దెలపెళ్లి వెంకటయ్య, తిరుపతి, మోహన్, మొండయ్య పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్



భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ సూచించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ టి.రమేష్, శ్రీరాంపూర్ ఎస్సై రాజేష్, నస్పూర్ ఎస్సై రవికుమార్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నస్పూర్ పట్టణంలోని అపార్ట్మెంట్, కమర్షియల్ బిల్డింగ్స్‌లో సెల్లార్స్, లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇంటి యజమానులు అందరూ వెంటనే సెల్లార్లో కరెంట్ మీటర్లు, వైరింగ్ ఉన్నట్లయితే వెంటనే మొదటి అంతస్తులోకి మార్చుకోవాలని సూచించారు. ముందస్తు జాగ్రత్త నిమిత్తం వాటర్ మోటర్‌ను అందుబాటులో ఉంచుకొని సెల్లార్లో నీరు నిండిన వెంటనే మోటర్‌తో బయటికి పంపించాలని కోరారు. అలాగే శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానులు సురక్షితమైన ప్రదేశమునకు వెళ్లాలని, వరద నీటి ప్రభావం నస్పూర్ మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యం మేరకు ప్రతి రోజు 24 గంటలు మున్సిపల్ సిబ్బంది, పోలీసు శాఖ అందుబాటలో ఉంటారని, ప్రత్యేకమైన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడమైనదని పేర్కొన్నారు. నస్పూర్ పట్టణంలో వరద నీరు చేరిన కాలువల్లో ఏవైనా ఇబ్బందులు కలిగితే పిట్టల ప్రభాకర్994921964, రమేష్ 9398493181, ప్రవీణ్ 8500258180 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి




నవతెలంగాణ-నస్పూర్

వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న బీజేపీ ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేసి తాము ఇచ్చిన మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సీఎం కేసీఆర్ గతంలో నిండు అసెంబ్లీ లో మాదిగల ఉద్యమానికి తానే నాయకత్వం వహించి వర్గీకరణ సాధిస్తా అని మాట ఇచ్చాడని గుర్తు చేశారు. చిత్తశుద్ధి ఉంటే ఈ పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగితేనె మాదిగ, మాదిగ ఉప కులాల విద్యార్థులు, ఉద్యోగులకు సమాన అవకాశాలు దక్కుతాయని అన్నారు. మాదిగ హక్కుల దండోరా ధర్నాకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తులా మదుసూదన్ సంఘీబావం తెలిపి, ధర్నా లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుశనపల్లి నారాయణ మాదిగ, కొలుగూరి విజయ్ మాదిగ, జిల్లా అధ్యక్షులు కదారి రమేష్ మాదిగ, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అట్కపురం సమ్మయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌ఛార్జి కొండ్ర ఉదయ్ మాదిగ, జిల్లా కన్వీనర్ వడ్లకొండ సంజయ్ మాదిగ పాల్గొన్నారు.

# యూటర్న్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బురుగుడా గ్రామంలో నాలుగు వరుసల జాతియరహదారికి అనుకోని ఉన్న బీసీ కాలనీలో డ్రైనేజి, బస్ స్టాప్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని గురువారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆ గ్రామస్థులు కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి ఏర్పాటులో గ్రామ సమీపంలో రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజి ఏర్పాటు చెస్థమన్న అధికారులు ఇప్పటి వరకు డ్రైనేజి ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరద నీరు ఇండ్లలోకి చేరుతుందని దీంతో కాలనీవాసులు తీవ్రఇబ్బందులు ఎదురుకుంటున్నారని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి డ్రైనేజి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బురుగుడా బస్ స్టాప్ వద్ద యూ టర్న్ ఏర్పాటు చేయకపోవడంతో రహపల్లి, చొరపల్లి, రాజురా బురుగుడా గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్నారని వెంటనే బస్ స్టాప్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని అన్నారు. వినతి పత్రం అందించిన వారిలో వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, ఎంపీటీసీ కాల్వ రమేష్, సర్పంచ్ బూసి భీమేష్, గ్రామస్థులు మనిగొండ వెంకన్న, ప్రకాష్, సదయ్య, రమేష్ ఉన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-నస్పూర్

2023-24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత గల షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులను లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా శాఖల భవన సముదాయంలో ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్‌రెడ్డితో కలిసి తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లక్కీడ్రా పద్ధతిన విద్యార్థినీ, విద్యార్థుల ఎంపిక ప్రక్రియ సజావుగా సాగిందని, 1వ తరగతిలో ప్రవేశం కోసం 113 మంది దరఖాస్తు చేసుకోగా 91 మందిని ఎంపిక చేయడం జరిగిందని, 5వ తరగతిలో 146 మంది దరఖాస్తు చేసుకోగా 92 మందిని ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఏకాగ్రత, చిత్తశుద్ధితో చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సురేష్, ఏఎస్‌డబ్ల్యూఓ అధికారి ఎం.రవీందర్ పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కోతకు గురైన రోడ్లు కూలిపోయిన ఇల్లు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోతకు గురయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తలాయి, సోమెని బీటీ రోడ్డు, మట్టి రోడ్డు కోతకు గురైంది. దీంతోపాటు సోమిని, గేర్రె గూడెం, బెజ్జూర్, ఎలుకపెల్లి, పాపన్నపేట రోడ్లు ఇరువైపుల కోతకు గురికావడంతో ప్రమాదకరంగా మారింది. కాగా మండలంలో అంబగట్టు గ్రామానికి చెందిన మిశ్రమ సత్తయ్య ఇల్లు కూలిపోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కోతకు గురైన రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

## క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొందిన యువత గైర్హాజర్ కాకుండా క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సంస్థ అభివద్ధిలో తోడ్పడాలని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య నియామకం ద్వారా 32మంది యువతి, యువకులకు జీఎం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోని సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. ఉద్యోగాలు పొందిన వారసులు కష్టపడి పని చేస్తూ సింగరేణి సంస్థకు అధిక లాభాలు తేవాలని కోరారు. ఉద్యోగాలు పొందిన యువత కష్టపడి క్రమశిక్షణ, రక్షణతో పని చేస్తూ సింగరేణి సంస్థకు అధిక లాభాలు తేవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్ఓ టూ జీఎం రఘు కుమార్, ఐకే ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏం.శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, సీనియర్ పీఓ కాంతారావు, పీఓఈ బాపయ్య, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

## కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేపీ నాయకులు

**రామకృష్ణాపూర్ :** కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీసులతో అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించినందుకు పట్టణ బీజేవైఎం ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ బీజేవైఎం అధ్యక్షుడు సంతోష్ రామ్ మాట్లాడుతూ దేశంలోని వివిధ బీజేపీ పాలిత రాష్ట్రాలల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో ఇండ్లను నిర్మాణం చేసి పేద ప్రజలకు పంపిణీ చేశారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులతో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తూ అర్హులైన పేద ప్రజలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ చేయకుండా నీచమైన రాజకీయాలకు పాల్పడుతున్న సీఎం కేసీఆర్‌ను నిలదీయడానికి బయలుదేరిన కేంద్రం మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని గురువారం అక్రమంగా అరెస్టు చేయడం దాన్ని తీవ్రంగా ఖండిస్తూన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేవైఎం జనరల్ సెక్రెటరీ బద్రి సతీష్, సీనియర్ నాయకులు పూనమల్ల బాపు, భూక్య బాలాజీ, గణేష్, భానుష్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
శుక్రవారం 21 జులై 2023

## నిండుకుండలా సదర్‌మాట్

• ఎనిమిది అడుగులు దాటిన నీటి మట్టం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరిలో వరద ప్రవాహం పెరిగి సదర్‌మాట్ ఆనకట్ట నిండింది. గురువారం ఉదయం వరకు 8.2 అడుగులకు పైగా ఆనకట్టలో నీరు చేరింది. వరద నీరు కట్టపై నుంచి నదిలోకి చేరుతుంది. అధికారులు వరద గేటును తెరిచి 5129 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. కెనాల్ మరమ్మతు పనుల కారణంగా కుడి, ఎడమ కాలువలకు ఇంకా నీరు వదలక పోవడంతో ఆయకట్టు రైతులకు ఎలాంటి ఉపయోగంలేని పరిస్థితి నెలకొంది.

## ఐటీ టవర్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ఐటీ టవర్ పనులను గురువారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న కృషితో జిల్లా కేంద్రానికి ఐటీ టవర్ వచ్చిందని అన్నారు. దీంతో జిల్లా యువతకు ఉద్యోగాలకు కల్పవృక్షంగా మారనుందని అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ పక్కనే రూ.40 కోట్లతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. పనులను పరిశీలించి, పలు సూచనలు తెలియజేశారు.

## హైలెవల్ కెనాల్ ప్యాకేజ్ పనులను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని గుండంపెల్లి గ్రామ శివారులో నిర్మించిన హైలెవెల్ కెనాల్ ప్యాకేజ్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. ఈనెల 28న మంత్రి కేటీఆర్ హైలెవెల్ కెనాల్ ప్యాకేజ్-27 ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పంప్ హౌస్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంప్ హౌస్ పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కరీం, ఎంపీడీఓ మోహన్, ఇరిగేషన్ ఏఈ గంగాధర్ ఉన్నారు.

## అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మునిపల్లి గ్రామంలో నూతనంగా నిర్వహించ తలపెట్టిన అంబేద్కర్ భవన నిర్మాణానికి గురువారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రూ.15 లక్షల నిధులు మంజూరు చేశారు. అన్ని విధాల సహకారం అందజేస్తాననిమ తెలిపారు. నిధులు మంజూరు కావడంతో అంబేద్కర్ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు గోలి గంగాధర్, అరుణ్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, నాయకులు లింగారెడ్డి, మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, నరేష్ రెడ్డి, మండల బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఈవీఎంలపై అవగాహన



నవతెలంగాణ-కడెం

ఈవీఎంలపై ఓటు వేసే విధానంపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నయ్య మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, ఆర్ఐ రాజన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**సిరికొండ :** మండలంలోని రాంపూర్(బి) గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్లకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శంకర్ నాయక్ మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా బీఎల్వోలు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తంబారే రేణుకబాయి, పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్, అంగన్‌వాడీ టీచర్ జానాబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బూత్‌స్థాయి సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ




నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి) బూత్‌స్థాయి సిబ్బందికి గురువారం తహసీల్దార్ కరీం ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో బూత్‌స్థాయి సిబ్బంది కీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఓటరు యాప్‌ను సరైన రీతిలో ఉపయోగించి, ఓటరు నమోదును యుద్ధ ప్రాతిపదికన అందజేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్‌గా డాక్టర్ ఎం.శంకర్ వ్యవహరించారు.

## జామ్‌లో దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్

నవతెలంగాణ-సారంగాపూర్



దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జామ్ గ్రామ ఉపసర్పంచ్ విలాస్ అన్నారు. గురువారం సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఆవరణలో నిలిచిన నీటి గుంతల్లో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం కురిసిన వానలతో గ్రామం చుట్టూ ఉన్న కుంటల్లో నీరు చేరిందని, దీంతో దోమలు వృద్ధి చెందాయని అన్నారు. వాటి నివారణకు ఆయిల్ బాల్స్ వేయడంతో లార్వ దశలోనే దోమలు మృతి, ఉత్పత్తి తగ్గుమొకం పడతాయన్నారు. గ్రామంలో ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ అతీయ ఫాతిమా, సుప్రియ నాయకులు నారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ... దేశానికే అన్నపూర్ణ

• మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-సారంగాపూర్

తెలంగాణ రాష్ట్రం దేశానికే అన్నపూర్ణ వంటిదని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని స్వర్ణ గ్రామంలోని రైతువేదికలో విద్యుత్ అంశంపై చర్చించేందుకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో 24 గంటల ఉచిత కరెంటుతో రైతుల బాధలు పూర్తిగా తొలగిపోయాయని తెలిపారు. రైతులు మూడు పంటలు పండిస్తున్నారని అన్నారు. తెలంగాణ దేశంలోనే అధిక పంటలు పండించే రాష్ట్రమని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చంద్రబాబు శిష్యుడని, ఆయన ఆరు 'గంటలంటే, ఈయన మూడు గంటలు అనడం సిగ్గు చేటన్నారు. రైతులకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులతో చర్చించి, రైతులు 24 గంటల విద్యుత్, మూడు పంటలకు నీరు అందేలా విద్యుత్ సౌకర్యం కల్పించాలని అందరూ రైతు వేదిక గా సంతకాలు చేసి తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జీ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్లు నారాయణరెడ్డి, మాణిక్ రెడ్డి, ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ చందు, మండల కన్వీనర్ మాధవ్‌రావు, ఎఎంసీ వైస్ చైర్మెన్ దత్తు రామ్, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ లక్ష్మీ నారాయణ, ఆయగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.




# రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

• ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్



నవతెలంగాణ-కడెం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. గురువారం మండలంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు 24 గంటల కరెంటు కావాలో, మూడు గంటల కరెంటు కావాలో తేల్చుకోవాలని అన్నారు. అనంతరం మండలంలోని పలువురికి మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. అంతకుముందు మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు సురేందర్ యాదవ్ తండ్రి ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సురేందర్ కలిసి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గొల్ల వేణుగోపాల్, కడెం సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్, నచ్చన్ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, మాసాయిపేట్ సర్పంచ్ రాముగౌడ్, కొత్త మద్దిపడగ సర్పంచ్ రాజమణి ఇందుర్, లింగాపూర్ సర్పంచ్ లచ్చన్న బాలవ్వ, పెద్ద బెల్లాల్ సర్పంచ్ సురేందర్ రమాదేవి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ ఎండీ హసీబ్, కడెం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీజేపీని నమ్మరు

నవతెలంగాణ-తాంసి

తెలంగాణ రైతులు, ప్రజలు కాంగ్రెస్, బీజేపీలను ఎట్టి పరిస్థితుల్లో నమ్మరని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం భీంపూర్ మండలంలోని నిపాని గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన మూడు గంటలు కావాల్నా, మూడు పంటలు కావాల్నా అనే అంశంపై రైతులతో చర్చించడానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరయ్యారు. మొదటగా నిపాని గ్రామ సర్పంచ్ స్వర్గీయ భూమన్న దొర వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వారు గ్రామానికి పార్టీకి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం సమావేశంలో ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రతీ ఒక్క రైతు గ్రామంలో హోటళ్లో, చౌరస్తాలలో, గ్రామ సభల్లో గత 75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో ఏ రాష్ట్రంలో అయిన తెలంగాణ రాష్ట్రం మాదిరిగా రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చి, కరెంటు సమస్య తీర్చారా అని ఒక్కసారి చర్చ జరపాలని అన్నారు. అనంతరం బెల్సార్ రాంపూర్‌లో నూతనంగా నిర్మించిన సవారీ బంగ్లా షెడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మెట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ నాగయ్య, ఎంపీపీ రత్నా ప్రభ సంతోష్, సర్పంచ్ ప్రమీల రాజన్న, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు లింబాజి, రైతుబంధు కోఆర్డినేటర్ అనిల్, గోవర్ధన్ రెడ్డి, బోథ్ ఎఎంసీ చైర్మెన్ రుక్మన్ సింగ్, మండల కన్వీనర్లు రాజారాం, వెంకటేష్, అరుణ్, బీసీ అధ్యక్షులు సంతోష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ధర్మ ప్రాశస్త్యాన్ని నేటి తరానికి తెలియచెప్పేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని, ఆలయాల అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని రిమ్స్ ఆవరణలోని మహా గణపతి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న షెడ్ నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. షెడ్ నిర్మాణానికి అయ్యే దాదాపు పదిహేను లక్షల రూపాయల ఖర్చును ఎమ్మెల్యేనే అందించనుండటంతో ఆలయ కమిటి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రిమ్స్ ఆవరణలో నిర్మించిన మహా గణపతి ఆలయంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు షెడ్ అవసరమని కమిటీ సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. షెడ్ నిర్మాణానికి అయ్యే ఖర్చును తానే అందిస్తానని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం కల్పించే వసతుల కోసం తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ బండారి సతీష్, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు కొత్తావార్ రాజేశ్వర్, నాయకులు రాంకుమార్, మెట్టు ప్రహ్లాద్, బండారి దేవన్న పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

• సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలో సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని గురువారం సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. గత 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్న కార్మికులకు సీపీఐ(ఎం) సభ్యులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కారోబారిలను, అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులను నియమించాలని డిమాండ్ చేశారు. ఆదివారం పండుగ సెలవులు మంజూరు చేయాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని సమ్మె చేస్తున్న కార్మికులను చర్చలకు పిలిచి సమస్య పరిష్కరించే విధంగా ఈ ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు బి.లలిత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు భాగ్య, మండల గ్రామపంచాయతీ మండల అధ్యక్షుడు పోశెట్టి పాల్గొన్నారు.

**బోథ్ :** పంచాయతీ పారిశుధ్య కార్మికులు గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ అన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమ్మెకు ఎమ్మార్పీఎస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. మద్దతు తెలిపినవారిలో ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ పాలేపు గణేష్, మండల అధ్యక్షులు అడ్డిగా స్వామి, పట్టణ అధ్యక్షులు ఏనుగంటి రవికుమార్, ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు గోనె అడెల్లు, గడ్డం హరీష్, మాకునూరి శివరాం, శివ, నరేష్, బిరుదుల ప్రవీణ్, కార్మికులు పాల్గొన్నారు.

**బాసర :** పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పవర్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. గత 14 రోజులుగా పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెతో గ్రామాలలో పారిశుధ్యం పడకేసిందని అన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వం మొండి వైఖరికి వెళ్లకుండా పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వారికి మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. వీరి వెంట బీజేపీ నాయకులు సాయినాథ్, రమేష్ సుభాష్ యాదవ్, అంతగిరి రాజన్న, కోదాటి భగవంతురావు, గంగాధర్ పాల్గొన్నారు.



## వరద ముప్పు లేకుండా చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

వర్షాకాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు ఎలాంటి వరద ముప్పు ఎదురవకుండా డ్రైనేజీల నిర్వాహణను సక్రమంగా చూడాలని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం తెలిపారు. గురువారం పట్టణంలోని 11 వార్డులో డ్రైనేజీల పరిస్థితిని కమీషనర్‌తో కలిసి పరిశీలించారు. కూలిపోయిన మురికి కాలువల్లోని మట్టిని తీయించారు. గతేడాది వర్షాల కారణంగా అటవీ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీటికి పట్టణంలోని పలు వార్డులు జలమయమై ప్రజలకు ఎదురైన ఇబ్బందులను గుర్తు చేశారు. ఈసారి అలాంటి పరిస్థితులు ఎదురవకుండా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

## సదర్‌మాట్ వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

సదర్‌మాట్ వద్ద సందర్శకులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మొఘల్‌పుర సొసైటీ కమిటీ సభ్యులు గురువారం ఖానాపూర్ డిప్యూటీ తహసీల్దార్, ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని మేడంపల్లి గ్రామ శివారులోని సదర్మాట్ ఆయకట్టు అందాలను సందర్శించడానికి ప్రతి యేట చుట్టుపక్కల ఖానాపూర్, మల్లాపూర్, మెట్‌పల్లి తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు విహారయాత్రలకు ఇక్కడికి విచ్చేస్తుంటారనీ అన్నారు. కాని సందర్శకులకు కనీస సౌకర్యాలు కల్పిండంలో యంత్రాంగం, అధికారులు విఫలమయ్యారని అన్నారు. అక్కడ కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు లేనందున ప్రతి యేటా సందర్శకులు మృత్యువాత పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మొఘల్‌పుర సొసైటీ అధ్యక్షుడు ముషీర్, ఉపాధ్యక్షుడు అర్షద్ అహ్మద్‌ఖాన్, మొయిజ్, ముక్తసిర్ ఖాన్, ఫసి ఉల్ హక్, సల్మాన్‌ఖాన్, రీజ్వన్, అవేస్, రియజ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని విట్టోలి, బ్రహ్మణ్‌గావ్ గ్రామాల్లోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు కోసం జిల్లా పరిషత్ నిధుల ద్వారా మంజూరైన రూ.15లక్షల ప్రొసీడింగ్ కాపీలను, సర్పంచ్‌లకు, నాయకులకు, సంఘ సభ్యులకు, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో ని విట్టోలి ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.2.5లక్షలు, రువ్వి గ్రామ బీసీ కమ్యునిటి హాల్‌కు రూ. 2.5లక్షలు, వెంకటాపూర్ గ్రామ ఎస్సీ కమ్యునిటి హాల్ కు రూ.5 లక్షలు, అష్ట గ్రామం నుండి బోరేగాం గ్రామ శివారు వరకు మొరం రోడ్డు వ్యవసాయదారుల కోసం రూ.2.5లక్షలు, రామ్ టెక్ శివారులో కల్వర్టు నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి, జెడ్పీటీసీ సరోజనరెడ్డికి, సర్పంచ్‌లు, నాయకులు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతుబంధు అధ్యక్షులు రామ్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, ఆత్మ స్వరూప్, బండారి గంగాధర్, సర్పంచ్‌లు విజేష్, సాయినాథ్, రాజేందర్‌రెడ్డి, నాయకులు రమేష్, శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్, బాబు, కిష్టయ్య, మైసాజీ, రవిందర్‌రెడ్డి, వంశీ, మాధవ్ రావ్, రాజు పాల్గొన్నారు.

## శంభు ఆశయ సాధనకు కృషి చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసీ ఉద్యమ నాయకుడు తుడుం దెబ్బ వ్యవస్థాపకులు సిడాం శంభు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో సిడాం శంభు 5వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పుట్టి, ఆదివాసుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడిన గోప్ప విప్లవకారుడనీ, ఆదివాసుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో నడిచి, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు పెందూర్ అంకూష్, పట్టణ అధ్యక్షుడు భవాళే కిరణ్, ఖానాపూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వావల్కర్ శివాజీ, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు సోన్ కాంబ్లే సునీల్, మండల కార్యదర్శి మెస్రం మురారి, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు మడవి లచ్చు, కాంబ్లే కోండిబా, సోయం మాధవ్ పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన నాగోబా చైర్మెన్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని నాగోబా ఆలయ చైర్మెన్ మెస్రం తుకారాం గురువారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో కలిశారు. నాగోబా ఆలయ వివిధ అభివృద్ధి పనులకు రూ.6.0కోట్ల మంజూరు కాగా, ఆ పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు. మంత్రి వర్యులు అభివృద్ధి పనులపై సానుకూలంగా స్పందించినట్టు చైర్మెన్ తెలిపారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 21 జులై 2023


## చట్ట వ్యతిరేకులపై చర్యలు తప్పవు

నవతెలంగాణ-వేమనపల్లి



శాంతి పరిరక్షణలకు విగాతం కల్గించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై సుబ్బారావు అన్నారు. గురువారం నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజారం గ్రామంలో సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, బాల కార్మికుల గురించి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా 100కి కాల్ చేయాలని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ఎల్లప్పుడూ పోలీసులు ముందు ఉంటారని అన్నారు. అలాగే గ్రామాలలో మరింత స్వీయ రక్షణకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు.

## ఉద్యానవన పంటల సాగుతో రైతులకు లాభం

నవతెలంగాణ-జన్నారం



ఉద్యానవన పంటలు పెంపకంతో రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని ఎంపీపీ మాదాడి సరోజన ఎంపీడీఓ అరుణ రాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన ఉద్యానవన పంటల పెంపకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉద్యానవన పంటలను రైతులు పెట్టుకొని అధిక లాభాలను గడించాలన్నారు. ఈ సమావేశంలో, ఎంపీఓ, రమేష్, ఏపీఓ, రవీందర్ పాల్గొన్నారు.

## అక్రమ బదిలీలు రద్దు చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. బదిలీల విషయంలో డీఈఓ వ్యవహరిస్తున్న తీరు అనుమానాస్పదంగా ఉందని, చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం డీటీఎఫ్ నాయకులు అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల్లో డీఈఓ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వేమన పల్లి మండలం నీల్వాయిలో పని చేస్తున్న ఎస్జీటీని సీతారాంపల్లి జిల్లా పరిషత్‌కు పంపడం ఆర్థిక ఒప్పందంలో భాగమేనని ఆరోపించారు. ఇలా కొంత మంది ఉపాధ్యాయులకు మాత్రమే డీఈఓ డైరెక్ట్ బదిలీల ఉత్తర్వులు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ, ఉపాధ్యక్షుడు కుమార్, కార్యదర్శి శంకర్, విజయ్, కొండయ్య, రాజేశం, సంతోష్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

## బిల్లులను వెంటనే క్రెడిట్ చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సంవత్సర కాలంగా ఉపాధ్యాయుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్, లోన్లు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, సప్లమెంటరీ, సరెండర్ లీవ్, డీఏ ఏరియర్స్, పీఆర్సీ ఏరియర్స్ ఈ కుబేర్‌లో పెండింగ్ ఉన్నాయని వెంటనే క్రెడిట్ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఏనగంటి బిక్షపతి, పత్తిపాక శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో డీఆర్సీ భవనంలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ బిల్లుల అంశంపై ఆర్థిక మంత్రికి అనేకసార్లు పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర శాఖ పక్షాన ప్రాతినిధ్యం చేయడం జరిగిందన్నారు. అయినా నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదని, బిల్లులను 31జులై లోపు ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లో జమ కాకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మడవి హనుమంతు, గడ్డం బిక్షపతి, తంగడపల్లి రాకేష్, ఇందారపు ప్రకాష్, మంజంపల్లి రమేష్, గుల్లపల్లి రవిశంకర్, డి.గంగాభవాని, పర్సా చంద్రశేఖర్, డోకె దామోదర్, ఇందారపు వికాస్, గుండు యాదగిరి, సమత, సుజాత, శంకర్ కుమార్, బాలు నాయక్ పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షునిగా సంగెం శ్రీనివాస్ ఎన్నిక

నవతెలంగాణ-కెరమెరి



బీజేపీ మండల అధ్యక్షునిగా సంగెం శ్రీనివాస్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం కాగజ్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, క్షేత్ర స్థాయిలో బీజేపీ పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు బాధ్యత పని చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, అజ్మేరా ఆత్మరాం నాయక్, చెర్ల మురళీధర్, ధోని శ్రీశైలం, కోట్నాక విజయ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్ర చారి మండల ప్రధాన కార్యదర్శి రంగు శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సందిగ్ధంలో పంటల సాగు

- బ్యారేజీల నిర్మాణంతోనే ముంపు మొదలైంది
- వరద నివారణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-జైపూర్

గోదావరి తీర ప్రాంతంలో పంటల సాగు సందిగ్ధంలో పడింది. దుక్కులు దున్ని సాగుకు సన్నద్ధమైన రైతులు విత్తనం పెట్టడానికి వెనుకడుగు వేస్తున్నారు. సరిహద్దులవరకు వచ్చిన గోదావరి వరద నీటితో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కాళేశ్వరం బ్యారేజిలో నిల్వ చేసిన నీటితో పాటు గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో గోదావరి నది నిండు కుండను తలపిస్తుండగా.. గత ఏడాది ఇదే సమయంలో భారీగా కురిసిన వర్షాలతో పొంగి ప్రవ హించిన గోదావరి వరద నీరు పంట పొలాల మీదుగా ప్రవహించింది. ఫలితంగా వేలాల, శివ్వారం, పౌనూర్ శివారు గోదావరి తీర ప్రాంతంలో సాగు చేసిన వరి, మిర్చి, పత్తి పంటలను తీవ్రంగా నష్టపోవల్సి వచ్చింది. కండ్ల ముందుకన్పించినచేదు అనుభవాలతో గోదావరి తీరంలో పంటలు సాగు చేయడానికి ఒకటికి పది సార్లు ఆలోచించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పత్తి సాగుకు సమయం మించిపోతున్నా గోదావరి తీరంలో విత్తనం నాటేందుకు రైతులు ముందడుగు వే యలేకపోతున్నారు. ఇప్పటికే పత్తి విత్తనం పెట్టుకోవడం, వరి, మిర్చి నారుమళ్ల తయారు చేసుకోవాల్సిన సమయంలో ముంపు ముప్పు దృష్టితో పంటల సాగు సందిగ్దంలో పడిందని వాపోతున్నారు.



సాగుకు సిద్ధం చేసుకున్న పంట చేను

**బ్యారేజీల నిర్మాణంతోనే ముంపు**

ఒక వైపు సరస్వతి బ్యారేజ్ (కాళేశ్వరం) మరో వైపు పార్వతి బ్యారేజ్ (సుందిళ్ల) నిర్మించినప్పటి నుండి గోదావరి తీర ప్రాంతానికి ముంపు ముప్పు మొదలైంది. సహజసిద్ధంగా కురిసే వర్షాలకు తోడు ఎగువన ఎక్కడ చినుకుపడినా శివ్వారం సరస్వతి బ్యారేజ్‌కు వచ్చి చేరుతుంది. బ్యారేజ్‌లో నిల్వ చేసిన నీటితో పాటు ఎగువ నుండి వచ్చే వరద కారణంగా ఒత్తిడి పెరిగి లోతట్టు ప్రాంతాలైన శివ్వారం, వేలాల, పౌనూర్ శివారుల్లో సాగు చేసిన పంట పొలాల్లోకి వరద వచ్చి చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పంటలు సాగు చేసి ఆర్థికంగా నష్టపోతున్న తీరుపై ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. గతేడాది గోదావరి ముంపు ప్రాంతాలను సందర్శించిన ప్రతిపక్ష నాయకులు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసినా ప్రభుత్వ పరంగా ఎలాంటి స్పందన లేకపోవడం బాధిత రైతులను ఆవేదనకు గురి చేస్తోంది. గతంలో ఎన్నడు లేనివిధంగా గోదావరి వరద వేలాల, శివ్వారం గ్రామాల్లోకి వచ్చిచేరడం, ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం తెల్సిందే.. గత నాలుగేండ్లుగా వరద ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం ఎలాంటి వరద నివారణ చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని బాధిత గ్రామాల వారు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

**వరద నివారణ చర్యలు చేపట్టాలి**

గోదావరి వరద నివారణ చర్యలు చేపట్టాలని వేలాల, శివ్వారం, పౌనూర్ శివారు రైతులు కోరుతున్నారు. గోదావరి ముంపుతో ఆర్థికంగా నష్టపోవల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ముంపు ముప్పు ముందే గుర్తించివుంటే ఇబ్బంది ఉండేదికాదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా గోదావరి తీర ప్రాంతంలో వరద నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తేలికపాటి వర్షాలకే సరిహద్దులకు వచ్చి చేరిన గోదావరి వరద భారీ వర్షాలు కురిసినప్పుడు పంట పొలాల మీదుగా పరుగులు పెడుతుందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు, జిల్లా అధికారులు ఈ విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.



నీట మునిగిన పంటలు (ఫైల్)



గతేడాది నివాసాల్లోకి వచ్చిన వరద (ఫైల్)

# కాంగ్రెస్ వస్తే ఉచిత విద్యుత్ బంద్

- రైతు సమావేశంలో ఎమ్మెల్యే దివాకర్ రావు




నవతెలంగాణ-హాజీపూర్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేస్తారని, రైతులు కరెంటును మరిచిపోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. గురువారం గుడిపేట్‌లోని రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్దే ప్రధాన లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అనుచితమని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. 2017లో అసెంబ్లీ సాక్షిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించినట్లుగానే సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగ చేస్తుండడంతో రైతులు బాగుపడుతుండగా ఓర్వలేని కాంగ్రెస్ నేతలు తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో మూడు పంటల విధానం కావాలా.. కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్లు మూడు గంటల కరెంట్ కావాలా.. అని ప్రశ్నించారు. కరెంట్ మోటార్లకు మీటర్లకు పెట్టాలన్న బీజేపీకి, 24 గంటల కరెంట్ వద్దన్న కాంగ్రెస్ పార్టీకీ రైతులు ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ వంటి సేవలతో దేశానికి అన్నం పెడుతున్న రైతులను రాజును చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమానికి పనిచేస్తున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, స్థానిక సర్పంచ్ లగిషెట్టి లక్ష్మీ రాజయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గోళ్ల శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్లు మంచాల శ్రీనివాస్, బేర పద్మ పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం పండ్ల తోటల పెంపకంపై అందించే సబ్సిడీలను ఉపయోగించుకొని లబ్ది పొందే విధంగా గ్రామాల్లోని రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారిని కిరణ్మయి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ నందకుమార్, ఎంపీఓ సత్యనారాయణతో క్షేత్రస్థాయి అధికారులకు పండ్ల తోటల పెంపకం సబ్సిడీలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉద్యానవన శాఖ ద్వారా మామిడి, జీడీ మామిడి, జామ, నిమ్మ, నారింజ, సీతాఫలం, సపోటా, ఆయిల్ ఫామ్, నేరేడు, ఆపిల్ బేర్ మునగ, డ్రాగన్ ఫ్రూట్ పండ్ల తోటల పెంపకాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ మిగతా వారికి 90 శాతం సబ్సిడీపై మొక్కలను పంపిణీ చేస్తుందని తెలిపారు. రైతులు బౌండరీ ప్లాంటేషన్ (చేను చుట్టూ) కింద కొబ్బరి మొక్కలను నాటుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ నెల 31 వరకు పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ అధికారుల వద్ద దరఖాస్తులు సమర్పించుకోవాలని తెలిపారు. 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి గల సన్న కారు రైతులు పథకానికి అర్హులని తెలిపారు. ఎంపికైన రైతులు మొక్కల నిర్వహణ, సంరక్షణ ఖర్చులను ఉపాధి హామీ ద్వారా పొందవచ్చునని తెలిపారు. ఆసక్తి గల రైతులు పథకాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయితీ అధికారులు టీఏ రమేష్‌లక్ష్మి రాజేంద్రప్రసాద్ ఏఈఓ శంకర్, పుష్ప పాల్గొన్నారు.

## భారీ వర్షానికి ఉప్పొంగిన చిక్లివాగు



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చిక్లివాగు ఉప్పొంగడంతో మండలకేంద్రంలో వరదనీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలకేంద్రంలో నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతుండగా రోడ్డు ప్రక్కనే బురదమయంగా మారడంతో ట్యాంకర్ బురదలో చిక్కుకుంది. నవెదరి గ్రామ చెరువులో చేపల వేట కోసం స్థానికులు ఎగబడ్డారు. అనేక గ్రామాల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగున్నతులు పీఆర్టీయూటీఎస్‌తోనే సాధ్యం



నవతెలంగాణ-కెరమెరి

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పీఆర్టీయూటీఎస్ తోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు జీపీఎఫ్, ఈయల్, టీఎస్ జీఎల్ఐ, ఏళ్ల తరలబడి నేటికీ ఉపాధ్యాయులకు అందలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులకు 8 సంవత్సరాల నుండి ఎటువంటి బదిలీలు, ఉద్యోగున్నతులు చేపట్టక పోవటం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఇప్పటికైనా స్పందించి రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జీఓ 317తో మిగిలి ఉన్న స్పౌజ్ కేసులను, కేజీబీవీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షులు జి.భరత్ రావు మండల్ అసోసియేట్ ప్రెసిడెంట్ శివప్రసాద్ పాల్గొన్నారు.

# జీపీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ-హాజీపూర్

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం చేయాలని ప్రజా సంగాల జేఏసీ నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో కొన సాగుతున్న జీపీ కార్మికుల సమ్మె సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు జి.ప్రకాష్, సీపీఐ పట్టణ అధ్యక్షుడు ఖలీందర్ ఖాన్ మాట్లాడారు. గ్రామల్లో పారిశుద్ధ కార్మికులందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువమంది పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం వారికి కనీస వేతనం ఇవ్వకుండా ఉద్యోగ భద్రత కల్పించకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవడం చాలా దుర్మార్గం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె న్యాయబద్ధమైనదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో చేసే పోరాటాలకు అండగా ఉంటామని తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నటువంటి కార్మికులపైన ప్రభుత్వం వివక్షత చూపించడం చాలా దారుణం అన్నారు .ఒక వైపు రోజు రోజుకి నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుంటే ఇచ్చే వేతనాలు సరిపోక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. జీఓ 51 రద్దు చేసి, జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె పై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాలుగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ పౌల్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దుర్కే మోహన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

**జన్నారం :** మండల కేంద్రంలో కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె 14వ రోజుకు చేరుకుంది. అందులో భాగంగానే గురువారం పారిశుద్ధ కార్మికులు భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు, గట్టు రాజమల్లు ప్రధాన కార్యదర్శి, రాజు మాట్లాడుతూ గ్రామా అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్న తమను ప్రభుత్వం గుర్తించడంలేదన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్, తెలంగాణ తల్లి విగ్రహం వరకు డప్పులతో పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేశారు. వారికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పారిశుధ్య కార్మికులు, సుధాకర్, లచ్చన్న, బాపన్న, చారి దుబ్బయ్య, శ్రీను, దాసు పాల్గొన్నారు.



హాజీపూర్ :



హాజిపూర్ :

**వంట వార్పుతో కార్మికుల నిరసనలు**

**ఆసిఫాబాద్ :** తమ డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు గత 14 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా 15వ రోజు కలెక్టరేట్ ఎదుట వంటవార్పు కార్యక్రమాలు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం చర్య తీసుకోవాలని వివిధ రకాలుగా నిరసన చేస్తున్నట్లు వివరించారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, గ్రామపంచాయతీ కార్మికులు రాజు, సమ్మయ్య, శంకర్, మహేష్, సాబీర్, నగేష్, విలాస్, కైలాస్, యమునభాయ్, పద్మ పాల్గొన్నారు.

**కాసిపేట :** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కరోనా సమయంలోలో కూడా ప్రాణాలకి తెగించి కష్ట పడ్డ పంచాయతీ కార్మికులని ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటు అన్నారు. వెంటనే వారికి ఉద్యోగ భద్రత కల్పించి రూ.21,000 కనీస వేతనం చెల్లించాలని అది కూడా పంచాయతి నిధుల నుంచి కాకుండా నేరుగా ప్రభుత్వం నుండే చెలించాలని, అలాగే రూ.10 లక్షల ప్రమాద భీమా ఇవ్వాలని వారి డిమాండ్ల సాధనకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుండా రాజుకుమార్, బోర్లాకుంట ప్రణయ్, షేక్ షారుఖ్, దుర్గం ప్రవీణ్ , జాడి మల్లేష్, మారం సురేస్, రామటెంకి ప్రవీణ్, రత్నం చిన్న, అనపర్తి చంద్రమౌళి పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు రాజకీయ చైతన్య యాత్ర



నవతెలంగాణ-జన్నారం

నేతకాని కుల హక్కుల సాధన కోసమే రాజకీయ చైతన్య యాత్ర నిర్వహించడం జరుగుతుందని నేతకాని మహర్ సంఘం రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నేతకాని మహర్ సమస్యల సాధనకై నిర్వహిస్తున్న రాజకీయ చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రకులాల రాజ్యాధికారంలో నేతకాని కులస్తులు తరతరాలుగా అన్ని రంగాల్లో అణచివేయబడుతున్నారన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ వారసులమైన నేతకాని జాతికి రాజ్యాంగబలాలు అందకుండా పోతున్నాయి అన్నారు. సమాజంలో సమానత్వం కోసం మా హక్కుల సాధన కోసమే ఈ రాజకీయ చైతన్య యాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నేతకాని కులస్తులకు అర్హులైన నిరుపేదలకు దళిత బంధు, దళిత బస్తీ, డబుల్ బెడ్ రూమ్ లాంటి, పథకాలను మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నెల 23 నుంచి ఇంద్రవెల్లి, ఉట్నూర్ మీదుగా జన్నారం వరకు చేపట్టబోయే రాజకీయ చైతన్య యాత్రలో ఖానాపూర్ నియోజకవర్గంలోని నేతకాని కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ చైతన్య యాత్ర సభ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు జాడి గంగాధర్, సమన్వయ సమితి కమిటీ చైర్మన్ కొత్తపెల్లి గణేష్, జాడి రాజేష్, బోర్లకుంట ప్రభుదాస్, దుర్గం అమృతరావు, జాడి వెంకట్, జునుగురు మల్లయ్య, దుర్గం నందయ్య పాల్గొన్నారు.

## తీజ్ ఉత్సవాల్లో అలరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దస్తూరాబాద్



మండలంలోని మున్యాల్ తండా గ్రామంలో గురువారం జరిగిన గిరిజనుల తీజ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రేఖా నాయక్ హాజరై గిరిజన ఆడపడుచులతో కలిసి నాట్యమాడి ఉత్సాహం నింపి, తీజ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక యుగంలో కూడా సంస్కృతి, సాంప్రదాయాలను మర్చిపోకుండా కొనసాగిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. పెండ్లికాని యువతులు నియమ నిబంధనలతో ఉండి ఉపవాసంతో నవధాన్యాల మొలకలకు తొమ్మిది రోజులు పూజలు చేసి, తొమ్మిదవ రోజు తీజ్ బుట్టాలను నెత్తిన పెట్టుకొని, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి వాటిని నీటిలో నిమజ్జనం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

## పసుపు రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



పసుపు రైతులు అవలంభించాల్సిన మార్కెటింగ్ వ్యూహాలు గురించి గురువారం మండలకేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎఫ్‌పీఓ ద్వారా విక్రయం, సబ్సిడీ, అధిక ధరలు పొందే విధానం గురించి రైతులకు వివరించారు. ఎన్సిడిఏక్స్ సంస్థ ద్వారా కొనుగోలు, లాభర్జన గురించి సంస్థ ప్రతినిధులు అవగాహనా కల్పించారు. సరైన విధానంలో లాభసాటి సాగు చేస్తూ, మార్కెటింగ్ అవకాశలు గురించి అవగాహనా పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్, మురళి, నాబార్డ్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## బైంసాలో ఒకరిపై దాడి

నవతెలంగాణ-భైంసా



పట్టణంలోని గోపాల్ నగర్‌కు చెందిన తోట శంకర్ అనే వ్యక్తిపై సంతోషిమాత నగర్‌కు చెందిన కాంతం నరేష్ స్క్రూ డ్రైవర్‌తో బుధవారం రాత్రిదాడికి పాల్పడినట్లు పట్టణ సీఐ ఎల్. శ్రీను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శంకర్‌కు అతని భార్యకు గొడవలు జరగగా, గొడవల విషయమై నరేష్ హెచ్చరించడంతో ఇద్దరి మధ్య మాట మాట పెరగగా స్క్రూ డ్రైవర్‌తో దాడి చేశాడు. బాధితున్ని చికిత్స నిమిత్తం నిజామబాద్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రిమ్స్‌లో జూనియర్ డాక్టర్ల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్ఎంపీ వైద్యులను ప్రభుత్వం అనుమతించొద్దని రిమ్స్ జూనియర్ డాక్టర్లు ఆందోళనకు దిగారు. గురువారం జిల్లా కేంద్రంలోని కళాశాల వద్ద తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రిమ్స్ అధ్యక్షుడు డా.అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి ధృవపత్రాలు అందించి మూడు నెలల వ్యవధిలో ప్రాక్టీస్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తామని, ఇటీవల వైద్యారోగ్యశాఖ నుంచి ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రోగులకు నష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనిపై స్పందించని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ ఉన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నిర్మల్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ గురువారం సూచించారు. టెలికాన్ఫెరెన్స్ ద్వారా జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులను సిబ్బందిని అప్రమత్తం చేశారు. వచ్చే మూడు రోజులు కూడ వర్ష సూచన ఉన్న దృష్ట్యా వాగులు పొంగిపొర్లి చెరువులు కుంటలు నిండుకుండ లాగా ఉన్నాయని, తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలు వద్దకు పిల్లలు, యువత ఎవరూ చెరువుల వైపు వెళ్లొద్దని సూచించారు.

## డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు కెప్టెన్‌గా ఉద్యోగోన్నతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేదికి కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. గత 2022 సంవత్సరంలో ఎన్సీసీ, ఓటీఏ నాగ్‌పూర్‌లో శిక్షణ పూర్తి చేసి ఆయన లెఫ్టినెంట్ నుంచి కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. ఈ ర్యాంక్ వేడుక సన్మాన పదోన్నతి కార్యక్రమం జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ మేరకు 32(టీ) బీఎన్ ఎన్సీసీ కమాండరీ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వికాస్ శర్మ జగ్‌రాంని స్టార్‌లను తొడిగి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబెదర్ మేజర్ సతీష్ కుమార్, పీఐ స్టాఫ్ నవీన్, అశోక్, ఎన్సీసీ అధికారులు, సిబ్బందితో పాటు ఎన్సీసీ కెడెట్స్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన గెడం కాశినాథ్ కుమారుడు ఇటీవల తన వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ నాయకులు అనిల్ జాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేగామ గ్రామానికి చెందిన మేకల లక్ష్మీ, మల్లేష్, కారాగిరి లక్ష్మి, గణపతిలకు రోడ్డు ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఆయన వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అక్షయ్, మడిగే రమేష్, యోగి, దేవేంధర్ రెడ్డి, జహీర్ డాక్టర్, జనార్ధన్ పాల్గొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-తాండూర్

ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ ఏజాజుజోద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో బూత్ స్థాయి అధికారులకు, సూపర్ వైజర్లకు ఎన్నికల ప్రక్రియపై శిక్షణ శిబిరంనిర్వహించారు. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో బీఎల్‌ఓలకు పలు అంశాలపై సలహాలు సూచనలు చేశారు. ఎన్నికల ఓటర్ల నమోదులో మార్పులు, చేర్పులు జాగ్రత్తతో నిర్వహించాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వరాదని తెలిపారు. తుది ఓటరు జాబితా అందరి ఆమోదం పొందే విధంగా ఎలాంటి తప్పులు లేకుండా రూపకల్పన చేయాలని ఆయన కోరారు.

# బీసీల ఆర్థిక చేయూత చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిర్మల్



బీసీ కులవృత్తులకు అందించే ఆర్థిక చేయూత చెక్కులను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గురువారం మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. వృత్తి పరంగా రాణించి, జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మంత్రి లబ్ధిదారులకు సూచించారు. ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో నిరాదరణకు గురైన కుల వృత్తులకు సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జీవం పోస్తోందని అన్నారు. కులవృత్తులనే నమ్ముకుని జీవిస్తున్న వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ. లక్ష సాయం అందించి అండగా నిలుస్తోందని అన్నారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా 50 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. జిల్లాలో మొదటి విడతగా నియోజకవర్గానికి 50 మందికి లక్ష రూపాయలు చొప్పున చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 14,521 నమోదు చేసుకున్నారని అన్నారు. వారిలో 11,746 లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జిల్లాల్లో ఉన్న విశ్వబ్రాహ్మణ, నాయీబ్రాహ్మణ, రజక, కుమ్మరి, కమ్మరి, కంసాలి, మేదరి వంటి వేలాది కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నదని, ప్రతీ లబ్ధిదారుడికి సాయం అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల బీఆర్ఎస్ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఈ వ్యాధుల నియంత్రణకు ఆధ్వర్యంలో పూర్తి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్, తాటిగూడ కాలనీలలో ఆయన విస్తృతంగా పర్యటించారు. సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా వార్డులో కాలినడకన తిరుగుతూ ప్రజలకు సూచనలు చేశారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమల వ్యాప్తి నియంత్రణకు ఆయిల్ బాల్స్‌ను వేశారు. అదేవిధంగా న్యాక్ శిక్షణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. మార్కెట్ యార్డ్ నుంచి చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. జయశంకర్ పార్కును సందర్శించి, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించావాల్సిన అవసరం ఉందని అన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వారంలో ఒకరోజు డ్రై డే పాటిస్తూ దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు మున్సిపాలిటీ తరఫున పూర్తి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, చెత్తను వేసేందుకు మున్సిపల్ వాహనాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అశోక్ స్వామి, కొండ గణేష్, కోవ రవి, సంజయ్, నల్ల మహేందర్, ప్రకాష్ పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ప్రశ్నించి నిరసన తెలిపేందుకు వెళుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్ట్ చేశారని గురువారం ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ పట్టణంలోని వినాయక చౌక్‌లో బీజేపీ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పోలీసులను వాడుకోవడంలో చూపించిన శ్రద్ధ ఇచ్చిన హామీలను నిలబట్టుకోలేకపోయారని అన్నారు. అదేవిధంగా ఆదిలాబాద్‌లోని ఉన్నటువంటి డబుల్ బెడ్ రూం ఎవరైతే అప్లై చేసుకున్న వారందరికీ ఇవ్వాలని లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మయూర్ చంద్ర, లోక ప్రవీణ్‌రెడ్డి, పాయల శరత్, జోగు రవి, ఆకుల ప్రవీణ్, సోమ రవి, దినేష్ మటోలియ, శివ, సురేందర్, సూర్య కిరణ్, సచిన్, రాజూ నరేశ్, రాకేష్ నాయకులు పాల్గొన్నారు.

**బీజేపీ నాయకులు ముందస్తు అరెస్ట్**

**లక్ష్మణచాంద :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు గురువారం నిర్వహించతలపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలనకు బయలు దేరిన బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. నియంతృత్వ పరిపాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారని మండల బీజేపీ నాయకులు పొలాస గోవర్ధన్ అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనకు పిలుపునిచ్చిన బీజేపీ నాయకులను అడ్డుకొని అరెస్ట్ చేయడం తగదని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో లక్ష్మణచాంద మండల అధ్యక్షులు పొలాస గోవర్ధన్, ఉపాధ్యక్షులు గుడ్ల రంజిత్, ప్రధాన కార్యదర్శి ఆలూరి రాజు, సీనియర్ నాయకులు భరత్ నారాయణ, కొండ్ర మోహన్, గంగాధర్, నాగుల రాజు, ప్రశాంత్ ఉన్నారు.

**దిలావర్‌పూర్ :** తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి, ఇండ్ల నిర్మాణ లోపాలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ అధిష్టానం పిలుపునిచ్చింది. గురువారం బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడుతారనే ఉద్యేశంతో పోలీసులు జెడ్పీటీసీ తక్కల రమణరెడ్డిని ముందస్తు గృహనిర్బంధించారు. దొడ్డికింది ముత్యంరెడ్డిని ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో చాలా లోపాలున్నాయని అన్నారు. నిర్మించిన ఇండ్లను లబ్ధిదారులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. చాలా చోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతామనే హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ బాకీల తెలంగాణగా మార్చారని అన్నారు. ఇకనైనా నాణ్యతతో కూడిన ఇండ్లను నిర్మించి, లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

**భైంసా :** డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిశీలనకు బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో గురువారం ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవర్ రామారావు పటేల్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పటేల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉందని, సీఎం కేసీఆర్ నియంతల వివరిస్తూ అరెస్టులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ముధోల్ నియోజకవర్గంలో ఎక్కడ డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి ఇవ్వలేదని అన్నారు. భైంసాతో పాటు రెండు మూడు గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించాలని, వాటి పరిశీలనకు వెళ్తానంటే అడ్డుకోవడం ఏంటన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అనర్హులకు కట్టబెట్టారని, నాసిరకంగా నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆదిలాబాద్‌టౌన్ :** ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి బీఆర్ఎస్ పార్టీ నిరంకుశంగా వ్యవహరిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాటసింగరం డబుల్ బెడ్ ఇండ్ల పరిశీలనకు వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని, ఇతర నాయకులను అడ్డుకుని, అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ప్రజా స్వామ్యంలో ప్రతి పక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్న కేసీఆర్‌కి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

## మున్నూర్ కాపు యువజన సంఘం అధ్యక్షులుగా గంట రాకేష్

నవతెలంగాణ-నిర్మల్



మున్నూర్ కాపు యువజన సంఘ నూతన అధ్యక్షులుగా గంట రాకేష్‌ను సంఘం సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గంట రాకేష్, ఉపాధ్యక్షులుగా ఓడన్నం నరేంధర్, మరుకుంటా అనిల్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా జప సందీప్, పుదరి శివకుమార్, కోశాధికారిగా అరె చిరంజీవి, ఉప కోశాధికారిగా ఇప్ప చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.

## అన్నాభావు సాఠే అసోసియేషన్ మండల కమిటీ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇటీవల అన్నాభావు సాఠే నూతన మండల కమిటీ అధ్యక్షులుగా కాంబ్లే బాలరాజ్, ఉపాధ్యక్షులు రాందాస్, బాలాజీ, ప్రధాన కార్యదర్శి అందరే బాలాజీ, సెక్రటరీ గోవింద్, జాయింట్ సెక్రటరీ ఆనంద్, కోశాధికారి అరుణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులను గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సోయం రాందాస్, మండల అధ్యక్షుడు పెందూర్ అంకుష్, ఖానాపూర్ నియోజక వర్గ ఉపాధ్యక్షుడు వావల్కర్ శివాజీ, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు సోన్ కాంబ్లే సునీల్, అదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి అరీఫ్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ దత్త, మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు కిరణ్, నాయకులు సుద్దోదన్, సాయి, మురారి, మాధవ్ పాల్గొన్నారు.

## ఉద్యమ వీరుడికి ఘన నివాళి



నవతెలంగాణ-ఉట్నూర్

ఉద్యమాల వీరుడు ఆదివాసీల హక్కులు, చట్టాల కల్పనకై పోరాటాలు సాగించిన సిడాం శంభు వర్ధంతికి కుటుంబ సభ్యులు, ప్రముఖులు, వివిధ ఆదివాసీ సంఘాలు, ప్రజా సంఘాలు నాయకులు ఘన నివాళుర్పించారు. సిడాం శంభు 5వ వర్ధంతి వేడుకలు గురువారం మండలంలోని మత్తడిగూడలో ఘనంగా నిర్వహించారు. సిడాం శంభు సమాది వద్ద ప్రముఖులు నివాళికి పుష్పగుచ్చాలు పెట్టి, నివాళుర్పించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు భుక్యా జాన్సన్ నాయక్‌తో పాటుగా తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంరం భీం ఉద్యమ స్ఫూర్తితో సిడాం శంభు అనేక ఉద్యమాలు చేసి అమరుడైన గొప్ప వ్యక్తన్నారు. ఆదివాసుల హక్కుల సాధనకై గళమెత్తిన విప్లవకారుడు సిడాం శంభేనని అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఆదివాసుల ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం కృషి చేసిన గొప్ప విప్లవ యోధుడని పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజనులు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సిడాం సోనేరావు, ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, జీవ వైవిధ్య నిర్వహణ కమిటీ సభ్యులు మర్సుకొల తిరుపతి, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు ఉన్నారు.

## మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రరెడ్డి మరణానికి సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. బ్రతికినంత కాలం ప్రజాజీవితంలో కొనసాగారు. తన కాలంలోనే ఆదిలాబాద్ జిల్లా అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అందులో ఆదిలాబాద్ రిమ్స్, మత్తడివాగు ప్రాజెక్టు లాంటి కీలకమైన అభివృద్ధి ప్రాజెక్టులు ఆదిలాబాద్‌కు తెచ్చి అభివృద్ధి చేశారు. విలువలతో కూడిన రాజకీయాలు చేశారు. ఆయన మరణం అటు కాంగ్రెస్ పార్టీకి, జిల్లా ప్రజానీకానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

## ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా నమత్కార్ నవీన్

నవతెలంగాణ-నిర్మల్



ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఈ నెల19న జిల్లా కేంద్రంలో జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై 8 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకుని, జిల్లా అధ్యక్షుడుగా నవీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్స్, ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులపై, జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలలో అన్ని కోర్సులు ప్రారంభించి, విద్యార్థులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తాని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శీతాల్కర్ అరవింద్, జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర్ పాల్గొన్నారు.

## రబీ పంట పరిహారం మంజూరు చెల్లింపులో జాప్యం

నవతెలంగాణ-బోథ్

ఈ సంవత్సరం కురిసిన అకాల వర్షాలకు రబీ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం మంజూరులో జాప్యం చేస్తుందని బోథ్ నియోజక వర్గ ఓబీసీ కన్వీనర్ తూము సూర్యం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు పరిహారం అందించడంలో జాప్యం జరుగుతున్నదని వాపోయారు. మొదటి, రెండవ జాబితాలో పేర్లు ఉన్న రైతులకు సంబంధించిన పరిహారం చెల్లించిన అధికారులు, మూడవ జాబితాలో పేర్లు ఉన్న రైతులకు పరిహారం చెల్లింపులు తీవ్ర జాప్యం చేస్తున్నారనీ విమర్శించారు. ప్రభుత్వం ఒకపక్క పరిహారం సత్వరమే రైతులకు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చిన ఈ విషయంలో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. తక్షణమే నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు కుమ్మరి రాజు, సింగం భోజరెడ్డి, కత్తూరి సతీష్, పోశెట్టి, నాగన్న, రైతులు పాల్గొన్నారు.

## ఈవీఎంలపై ప్రజలకు అవగాహన

నవతెలంగాణ-లోకేశ్వరం

రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఈవీఎంలై అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని పుస్పూర్, నర్సింహానగర్ తండ గ్రామస్తులకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలో ఓటు వేసే సమయంలో ఈవీఎంలు పనిచేసే తీరును గ్రామస్తులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్క యువతీ, యువకులకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, నాయబ్ తహసీల్దార్ షబ్బీర్, జూనియర్ అసిస్టెంట్ నరేష్, సర్వేయర్ నరేందర్, వీఆర్ఎ జలంధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో బోనాల వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బోనాల పండుగ నిర్వహించి సందడి చేశారు. ప్రతిరోజు పిల్లలకు పోషకాహారాలను అందించి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను ఆడించి పాడించి అంగన్‌వాడీలు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అన్మల్వార్ కవిత, అపర్ణ, మీనాక్షి, సువర్ణ, జ్యోతి, అనిత పాల్గొన్నారు.

## బాసర ఆలయ హుండీ ఆదాయం రూ.67లక్షలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గురువారం ఆలయంలోని రూ.150ల అక్షరాభ్యాస మండపంలో ఆలయ ఈఓ విజయ రామారావు ఆలయ సిబ్బంది పోలీసుల సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో నగదు రూ.67లక్షల 8వేల400రూపాయలు, 75 గ్రాముల మిశ్రమ బంగారం, మిశ్రమ వెండి మూడు కిలోల 600 గ్రాములు, విదేశీ డాలర్లు 27 వచ్చాయని ఈ ఆదాయం ఆలయానికి 44 రోజుల్లో సమకూరిందని ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు శ్రీశైలం భ్రమరాంబిక, జ్ఞాన సరస్వతి దేవి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. హుండీలో బయటపడ్డ ఆర్జీయూకేటీ యూనివర్సిటీ పేరెంట్స్ కమిటి వినతిపత్రం అమ్మవారి హుండీ లెక్కింపులో ఆర్జీయూకేటీ యూనివర్సిటీ పేరెంట్స్ కమిటీ వారి వినతిపత్రం బయటపడింది. ఇందులో విద్యార్థుల సమస్యల గురించి రాసి ఉన్నట్టు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

## కడెం ప్రాజెక్టుకు చేరుతున్న వరద ప్రవాహం

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్ట్ ఎగువన కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టు వరద ప్రవాహం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పూర్తి నేటి మట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 691. 900 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్ట్‌కి 12,680 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రెండు గేట్లు ఓపెన్ చేసి 1,11,091 క్యూసెక్కుల నీటిని వరద గేట్ల ద్వారా విడుదల చేశారు.

## కార్మిక గర్జనను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

కార్మిక సమస్యల సాధనకు ఆగస్టు 4న హైదరాబాద్‌లో జరుగు కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ బీడి ఫ్యాక్టరీలో కార్మిక గర్జన ధర్నాను జయప్రదం చేయాలని బ్యానర్లు, పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడి పరిశ్రమలో అన్ని కేటగిరీలకు చెందిన బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి అమలు చేయాలన్నారు. వేలాదిమంది కార్మికులతో ఆగస్టు 4న మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లో కార్మిక గర్జన నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కే.లక్ష్మీ, రామలక్ష్మణ్, కిషన్, పోశెట్టి, రాజేందర్, మల్లేష్, ఎల్లయ్య, గంగామణి, శోభ, కమల, సోఫియా పాల్గొన్నారు.